ఇన్ని లక్షల టెలిఫోన్లు ఇచ్చేస్తున్నాం; ఇన్ని కోట్ల లైన్లు ఒచ్చేస్తున్నాయని పేపర్లలో స్టేట్ మెంట్లిస్తూంటారు కదా; అదంతా వట్టిదేనా? పోనీ నన్నొకసారి తమ దర్శనానికి రమ్మంటా రేమిటి?"

"అక్కర్లేదు. మీరు మాకేదైనా లెటర్ రాస్తే మీ నెంబరు మాత్రం తప్పకుండా ఉదహరించాలి. అంతే."

"థాంక్యూ సార్. ఉంటానండి" అని ఫోన్ పెట్టేశాను.

మా నాన్నగారి మొహం బందరు ఉల్లిపాయలాగ ఎర్రగా అయిపోయింది. ఎక్స్‌టెన్షన్ ఫోన్ దింపేసి అన్నారు. "నీ మొహానికి టెలిఫోనొకటి తక్కువైంది! బుద్ధి తెచ్చుకుని ఇంటికి నడు!"

బ్లాంకులు ఫిలప్ చెయ్యని ఆ అధికారిని మళ్లా పదో క్లాసు చదవమనకుండా నామీద చిరాకు పడ్డంతో సరిపుచ్చుకున్న మా నాన్నగార్ని మనసులోనే అభినందించుకున్నాను. ★

# 31. విషపుత్రికలు

మర్చంట్ నేవీలో పనిచేస్తున్న మా దొడ్డమ్మ కొడుకు "సుబ్బు" మొన్న ఒకటో తారీఖున ఆర్నెల్ల తరువాత ఇంటికొచ్చాడు. ఇలా ఆరేసి నెలలు నౌకలమీద ఉండి విదేశాలు చక్కబెడుతూ పదిహేనేసి రోజులు ఇంటి దగ్గర గడపడం మా సుబ్బుకి ఇరవై ఏళ్లనించీ పరిపాటే. ఈ సారి ఇంటికి రాగానే మా మరదలు, "పిల్లలిద్దరూ పరీక్షలు ఫేలయ్యారు" అన్నవార్త చెవిన వేసి "ఓ యేడాది వెనకబడితే పడ్డారుగానీ వాళ్లిద్దరూ ఇప్పుడైనా ఒకదార్ని పడేటట్టు చూసి మరీ వెళ్లండీ, దేశాలమీదికి!" అని హెచ్చరించినట్టుంది. సుబ్బు ఎవర్నో బెత్తాయించి తన కారు ఇచ్చి నన్ను తీసుకురమ్మన్నాడు.

"మా కుర్రాళ్లిద్దరూ పరీక్ష ఫేలయ్యారట, నీకు తెలీదా?"

"అవునట; మా అమ్మాయి చెప్పింది!"

"నేను ఉద్యోగరీత్యా దేశాలు పట్టిపోయినా నువ్వు కూతవేటు దూరంలో ఉన్నావన్న ధైర్యంతోనే కదా, వెళ్తున్నాను! నువ్వు ఉండికూడా ఇలా అయిందేమిటా అని బాధగా ఉందన్నయ్యా!"

నేను ప్రతీరోజూ, ఆఫీసుకి వెళ్లేటప్పుడూ ఆఫీసునించి ఒచ్చేటప్పుడూ కూడా మీ ఇంటికొచ్చి వాళ్ల చదువుల సంగతి ఎలా ఉందని అడిగే వెళ్తున్నాను. ఔనో కాదో మా మరదల్ని అడుగు, లేకపోతే నీ కొడుకుల్ని అడుగు" అన్నాను.

"పిలు, వాళ్లిద్దర్నీ!" అన్నాడు సుబ్బు; మా మరదలు సీతతో.

"సుబ్బు" ఇల్లు చాలా పెద్దది. కింద భాగంలో పెద్దహాలు. దాన్ని అనుసరించి రెండు బెడ్‌రూమ్‌లు వాటికి ఎటాచ్‌డ్ బాత్‌రూమ్‌లూ. ఆ రెండు బెడ్ రూమ్‌లకీ మధ్య స్టోర్ రూమ్-కమ్-బార్. హాలుకి మధ్యగా గొప్ప ఆర్టిస్టిక్‌గా కట్టిన మేడమెట్ల వరస; ఆ తరువాత డైనింగ్

హాలు, దానికి అనుసరించి వంటిల్లు, ఆ పక్కని పనిమనిషీ దాని మొగుడూ ఉండడానికి ఒక మెష్ వరండా. ఇంకా మేడమీద రెండు విశాలమైన బెడ్‌రూమ్‌లు; వాటి మధ్య లంబర్ రూమ్. మిగిలిందంతా డాబా. ఆ ఇల్లు రెండు కుటుంబాలకి ధారాళంగా సరిపోతుంది గానీ, మేడ మెట్లు సరిగ్గా హాలు మధ్యనించి ఉండడాన్నించి అద్దెకివ్వడానికి వీల్లేకుండా అయిపోయింది.

ఇంటినిండా విదేశీ వస్తువులే. కిందభాగంలో హాల్లో ఒక టి.వి., వి.సి.ఆర్., మ్యూజిక్ సిస్టమ్స్. మేడమీద ఒక బెడ్ రూంలో పోర్టబుల్ టి.వి. రెండో దాంట్లో మిని టి.వి. వంటింట్లో ఉన్న కుకింగ్ రేంజి, క్రాకరీ, హాట్ బాక్స్, బాత్ రూముల్లో గీజర్ల దగ్గర్నుంచి ఎవ్విరిథింగ్ ఇంపోర్టెడే. సోఫాకం బెడ్లు, టేబుల్స్, చేర్సు, అన్నంగిన్ని, పోపుల గరిటె ఇలాంటివేవో ఇండియాలో (విశాఖపట్నంలోనే) తయారైనవి లేకపోలేదు.

"పిలు" అనగానే సీత గోడదాకా వెళ్లి రెండు స్విచ్చిలు నొక్కింది. ఒక స్విచ్చికి పైన ఉన్న బల్బు ఒకసారి వెలిగి ఆరిపోయింది. రెండో స్విచ్చి దగ్గిరున్న బల్బు వెలిగి ఆరిపోయి, మళ్లీ వెలిగి మళ్లీ ఆరిపోయి ఇలా కొన్ని సెకండ్లు ఏవో సంకేతాలిచ్చింది.

"పెద్దవాడు వొస్తున్నాడు. చిన్నవాడు కొంచెం సేపు పోయాక వస్తాట్ట" అంది సీత. మళ్లీ వచ్చి సుబ్బూకీ నాకూ మధ్య కూచుంటూ.

"ఏంటీ డాడీ! మనం సాయంకాలం కదా; కల్సి ఎటో వెళదామనుకున్నాం?" అన్నాడు పెద్దకొడుకు "సూర్య"

మేడ మెట్ల మీద టపటపామని హవాయి చెప్పుల్తో శబ్దం చేస్తూ చిన్నవాడు "చంద్ర" దిగేడు. వాడి చేతిలో ఏదో పుస్తకం ఉంది. "ఇదిగో, సూర్యా! దీంట్లో ఉంది. ఆ కొశ్చన్‌కి ఆన్సర్. అంచేత మనం నెక్స్‌ట్ వీక్ దాకా ఆగక్కర్లేదు. బెట్ గెల్చుకున్నట్టే. లెటజ్ గో టు పరమ్ అండ్ కలెక్ట్ ద బెట్ మనీ."

"ఈజిట్?" అని సూర్యా, సంబరంగా ఆ పుస్తకం అందుకొని పేజీ చూసేసి "యు ఆర్ ఎ జమ్; చంద్రా!" అని తమ్ముడికి షేక్హాండిచ్చాడు. ఆ పేజీలో స్లిప్ తనకి ముఖ్యమని తోచిన వాక్యం కింద గీత గీసి; ఆపేజీ దగ్గర బాల్ పాయింట్ పెన్ ఫిక్స్ చేసి, పుస్తకం మూశాడు. "లెట్స్‌గో" అని లేచి, "ఎక్స్‌క్యూజ్మీ డాడీ, ఐదు నిమిషాల్లో మళ్లీ ఒచ్చేస్తాం" అని వెళ్లారు.

పిల్లలు ఎవరితోనో పందెం వేసుకున్నారు. దానికి సమాధానం ఈ పుస్తకంలో ఉంది అని అర్థమైంది. అందుకని ఆ పేజీ విప్పి, అండర్ లైన్ చేసిన వాక్యాలు చదివేను. "అన్నవాహిక ద్వారా స్త్రీ శరీరంలో చేరే రేతస్సు గర్భధారణకు కారణం కాజాలదు."

చదివిన వాక్యం సైన్స్‌కి సంబంధించింది కనుక జుగుప్స కలుగకూడదు. కాని ఈ సూర్య, చంద్రుల వయసులు 17, 16. వాళ్ళు ఫేలయినది ఇంటర్ పరీక్షలో. అందుకని; వాళ్లు ఈ వాక్యం గురించి వెతుకుతూ కొంత సమయం ఖర్చుచేసేరని; ఇది ఇలాగా కాదా అని మరెవరో కుర్రాళ్లు వీళ్లతో పందెం వేసేరంటేను; జుగుప్స తప్పక కలగ వలసిందే కదా.

నా మొహం వికారంగా మారడం చూసి సుబ్బు ఆ పుస్తకాన్ని నా చేతుల్లోంచి అందుకొని ఆ వాక్యం చదివేడు. "ఒరి వెధవల్లారా ఇదా, మీ చదువు?" అని లేచాడు. "రా!" అని మేడ మీదికి దారి తీశాడు.

పిల్లలిద్దరి గదిలోనూ నాలుగు రకాల తెలుగు వారపత్రికలున్నాయి. కొన్ని మంచాల మీద, కొన్ని కిందని, అలమార్లలో, టీపాయ్‌ల మీద, తెరచి, మూసి రకరకాలుగా.

"వీళ్ళు చదువుతున్నది క్లాస్ పుస్తకాలా, వారపత్రికలా?"

"ఇప్పుడంటే సెలవలు కనుక వీక్లీలు చదువుతున్నారేమో!"

"అయినా ఏమిటి? ఈ పత్రికల్లో బొమ్మలు ఇలా ఉన్నాయేంటీ? అయ్యో, అయ్యో! ఈ బొమ్మలన్నీ కథలకీ నవలలకీ ఇలస్ట్రేషన్లా? కథల్లోనూ, సీరియల్స్‌లోనూ ఇలాంటి దృశ్యాలు వర్ణించి ఉన్నాయా, లేకపోతే ఆర్టిస్టులే తమకి తోచిన విధంగా పాఠకుల్ని ఆకర్షించడానికి ఇలాంటి బొమ్మలు వేస్తున్నారా?" ఏవో ప్రశ్నలు అడుగుతున్నాడు సుబ్బు.

"వారపత్రికలకి ఆకారం స్వభావం బాగా మారిపోయాయి సుబ్బూ! ఏదో ఒక నెపం పెట్టి శృంగారం సబ్జెక్టుగా ఉండే కథలకీ, సీరియల్స్‌కీ ప్రాధాన్యం ఇస్తున్నారు. శృంగార ఘట్టాల వర్ణనలు గీత దాటి బూతు కూడా దాటి వచ్చేస్తున్నాయి. ఒక పత్రిక వారు మధ్య పేజీల్లో "మీ పిల్లలు చూడకుండా చింపేసి దాచుకుని మీరే చదువుకోడానికి" అని వేస్తారు. మరొకరికి ఆ బాధకూడా లేదు. వారికి పుస్తకం ఎవరుకొంటారా అన్న ఆలోచనే తప్ప ఎవరు చదువుతారు. దాని పరిణామం ఏమిటి అన్నది తోచదు. అంతగా అయితే ఓ వారంపాటు జైల్లో కూర్చుని తిరిగి వచ్చేస్తారు. ఇంచుమించు అన్ని వారపత్రికల్లో సెక్సు జ్ఞానాన్ని వ్యాసాల రూపంలో ప్రశ్నలు - జవాబులు రూపంలో పచ్చిగా చర్చిస్తున్నారు. లక్షలాది సంవత్సరాల మనుగడలో మనుష్యులు సెక్సు జ్ఞానం సెక్సు ప్రకోపం తగినంతగా అందక ఎంతో మోసపోయారనీ మరెంతో నష్టపోయారనీ ఘోషిస్తూ ఈ వారపత్రికలు యువతరాన్ని గొప్ప బాధలో పడేస్తున్నాయి. ప్రచురణ అవుతున్న కథల్లో నవలల్లో ఎక్కువ భాగం భార్యాభర్తల మధ్య శృంగారాన్ని కాక, వేశ్యాగృహంలోని శృంగారాన్నీ కాక, వ్యభిచారాన్ని, ఫ్రీలవ్‌ని చర్చిస్తూ ఇదే శృంగారం, ఇదే జ్ఞానం, ఇదే సంస్కృతి అని పాఠకుల్ని భ్రమ పెడుతున్నాయి. శృంగారం అంటే పచ్చి సెక్సు అయి కూర్చుంది! "ఈ వారం సెక్సు కథ" అని టైటిల్ పేజీమీద ప్రకటించి మరీ పత్రిక విడుదల చేస్తున్నారు ఎడిటర్లు. మిగిలిన పత్రికల్లో కంటే మన పత్రికలో బూతు తక్కువైపోతోంది అని ఎప్పటికప్పుడు ఆత్మ పరిశీలన, పర రంధ్రాన్వేషణ చేసుకుంటూ, స్వతహాగా మంచి అభిరుచులు కలిగిన సంపాదకులు కూడా ఈ సెక్స్‌వేవ్‌లో కొట్టుకు పోతున్నారు. మొన్నీమధ్య ఒక కొత్త వీక్లీ వచ్చింది. మూడు వారాలదాకా "మడి కట్టుకు" కూర్చుని, అమ్మకాలు పెరగలేదన్న మిషతో, "మీ పత్రికలో సెక్స్ కథలు, సెక్స్ విజ్ఞానం గుప్పించండి" అని ఎవరో రాసినట్టు ఉత్తరాలు సృష్టించుకుని వాటిని ప్రచురించి ఆ పత్రిక కూడా "సెక్స్ ప్లాయిటేషన్"కు గురి అయిపోయింది.

"మనతరంలో వారపత్రికల్లో కొంత హాస్యం, కొంత కాలక్షేపం, కొంత సామాజిక స్పృహ ఉండి, సాహిత్యపు విలువల్ని కొంతమట్టుకైనా పట్టుకు వేళ్లాడేవి. శృంగారానికి, బూతుకి వేరే పత్రికలుండేవి కదా! అట్లాటిది ఇవాళ ఇంచుమించు అన్ని వారపత్రికలూ సెక్సు పత్రికలే అయిపోయాయి అనిపిస్తోంది, నువ్వు చెప్పిందాన్ని బట్టి!" అన్నాడు సుబ్బు.

"ఒకటి రెండు వారపత్రికలు అప్పటి మూసలో ఉండిపోయినవీ ఉన్నాయి మరి. కాని అవి ఈ గుట్టల్లో ఎక్కడా లేవు" అని చెప్పేను.

సుబ్బు మేడ దిగాడు. తన గదిలోకి వెళ్లి ఒక తుపాకి తెచ్చేడు. "రానీ. వెధవలిద్దర్నీ షూట్ చేసేస్తాను" అన్నాడు.

"ఎవరైనా షూట్ చేయవలసింది పాఠకుల్ని కాదు. ఆవేశపడకు." అని సుబ్బు చేతిలో తుపాకీ లాక్కుని సీతకి అప్పగించేను. "పిల్లలు జాగర్త" అని చెప్పి ఇంటికి బయలుదేరాను. "కట్టు కథకీ పెట్టుబడికీ పుట్టిన విషపుత్రికలు" అని వారపత్రికలకు నిర్వచనం చెప్పిన మహాకవిని మరోమాటు స్మరించుకున్నాను. ★

# 32. ఇంతకీ, "తమరు" ఏలింగం?

**మా** అబ్బాయి పెళ్లి తరువాత ఏర్పాటు చేసిన రిసెప్షన్ హడావిడిలో నా సూట్‌కేస్ తాళాలు ఎందుకో అవసరం వచ్చాయి. అవి మా రెండో అబ్బాయి 'చిట్టి'కి ఇచ్చినట్టు జ్ఞాపకం. అందుకని వాడికోసం షామియానా అంతటా వెతికేస్తున్నాను. ద్రోణుడి దగ్గిర అస్త్ర విద్య నేర్చుకుంటున్న అర్జునుడికి ఏకాగ్రత పాఠంనాడు చెట్టు చిటారు కొమ్మనున్న ఒకే ఒక ఎర్రటికాయ తప్ప మరేం కనబడనట్టు నా కంటికి ఆ షామియానా అంతటా నించునీ, కూచునీ ఉన్న అశేష జనంలో వి.ఐ.పి. ల దగ్గర్నుంచీ ఎవరూ ఆనడం లేదు. నేనెవరి కోసమో తెగ వెతికేస్తున్నట్టు కనిపెట్టిన మా తమ్ముడి బావమరిది నన్నో క్షణం అటకాయించి "ఎవరికోసం బావగారూ వెతుకుతున్నారు?" అని రొకాయించాడు. నేను నిస్సహాయంగా అతని కళ్లలోకి కూడా చూడకుండా (శూన్యంలోకి చూస్తూ అనాలి గావును!) "మా చిట్టి ఎక్కడా కనబడ్డం లేదండీ" అన్నాను. "ఇదిగో ఇక్కడే ఉంది;" అని మా మరదల్ని చూపించేడు. మా మరదల్ని వాళ్లింట్లో అందరూ "చిట్టీ" అనేవారని గుర్తొచ్చి నాకు నవ్వొచ్చింది.

ఇంకోసారి మా బావమరిది గారింటికి కాకినాడ వెళ్తూ, తోవంతా వాళ్ల బావమరిది 'చిన్ని' గురించి ఆలోచిస్తూ ఉన్నానేమో; కుశల ప్రశ్నలు అయ్యాక "పాపం, చిన్నికి ఈ మధ్య ఏక్సిడెంట్ అయిందటగా, ఇప్పుడెలా వుంది?" అన్నాను. మా బావమరిదికి వెంటనే వాళ్ల బావమరిది గుర్తు రాలేదనుకుంటాను. నవ్వేడు. "నువ్వు మంచి తమాషాగా మాట్లాడతావే!" అని నన్ను మెచ్చుకున్నాడు. లోపలికి తిరిగి "చిన్నీ, ఇలా రా; మామయ్య పిలుస్తున్నాడు" అన్నాడు.ఇంట్లోంచి పదమూడేళ్ల పిల్ల సిగ్గు పడుతూ ఒచ్చి వాళ్ల నాన్న వెనుక నుంచుంది. "మామయ్యకి దండం పెట్టుకో, నీ కట్నం నీకు ముట్టచెప్తాడు" అన్నాడు. నాకు అప్పుడు గాని అర్థం కాలేదు మా బావమరిది కూతురు 'చిన్ని' వారం రోజుల క్రితం 'పెద్దమనిషి' అయిందనీ, ఆ సందర్భంగా ఆ పిల్లకి నేనొక లంగా, వోణీ, జాకెట్టు (లేదా వాటికి సరిపడే డబ్బు) బాకీ వున్నానని. ఆ విధంగా నూరు రూపాయల తక్షణ జరిమానా చెల్లించుకున్నాను.

ఆ మధ్య నేనొక పత్రికకి సాంస్కృతిక విలేఖరిగా పనిచేస్తూ ఉండిన రోజుల్లో మాకు ఆఫీసర్‌గా ఉండే రామయ్య గారు ట్రాన్స్ఫరై కైలాసరావు గారనే ఆయన వొచ్చారు. సాంస్కృతిక సమాజాలతో నాకు ఏర్పడిన పరిచయం కర్ణాకర్ణిగా విని ఆ రంగంలో నాకు కొంత పలుకుబడి